
రాత్రంతా నిశాకన్యతో జాగారం చేసిన చంద్రుడు వేకువ కాగానే వెలిసిపోయి పొద్దెక్కగానే వెలుగులో కలిసిపోయాడు.


యమున గలగల ప్రవహిస్తోంది పక్షుల కిలకిలలు వింటూ, ఉదయించిన దినాధిపతితో ఊసులాడు కుంటూ.

# అనంతం

'హైమ'



ఉసూరుమనుకుంటూ వచ్చిన రాధమ్మ కడవ యమున గట్టున పెట్టి కూర్చుంది. పాదాలను ప్రవహిస్తున్న నీటిలో వుంచింది. ఆకాశంలో బరువుగా కదులుతున్న నల్లమబ్బు మనసులోని జబ్బులా దిగులుగా వుంది. రాధ పాదాలను కడుగుతున్న యమున వేణు నాదాలు వినిపిస్తోంది. చల్లగా తగులుతున్న అలలు తియ్యటి కలలు రేపు



తున్నాయి. కలలు కళ్ళల్లో నిండితే వాటిలో కన్నయ్యను దర్శిస్తోంది రాధ.

"ఎన్ని యుగాలైంది కన్నయ్యను చూసి" దిగులుగా అనుకుంది. జ్ఞాపకాల ప్రవాహంలో గతించిన రోజులు కొట్టుకొస్తున్నాయి. కన్నయ్య వెన్నతిన్న రోజులు, వేణునాదం వినిపించిన రోజులు, వెన్నెల్లో నడిచిన రోజులు, వేడుకలు చేసుకున్న రోజులు మళ్ళీ వస్తాయా? రావు. బాలుడు, గోపాలుడు ఐన కృష్ణుడు రాతలనే మార్చగరిగిన భూపాలుడు అయ్యాడు. తోటల్లో తిరిగిన వాడు కోటలో వున్నాడు. రాసలీలలు చేసినవాడు రాచకార్యాల్లో మునిగాడు. అలాంటివాడు యమున గట్టున తేలడం ఎంత కష్టం. ఆ రోజుల అందం కాలచక్రం కింద నిస్సహాయంగా నలిగిపోయింది. బాధకు పర్యాయపదంగా రాధ మిగిలింది. అంతే. బరువుగా నిట్టూర్చింది రాధ. చుట్టూ ఒకసారి కలయజూసింది.

శిశిరపు శరపరంపరకు ఆకులు గలగల రాలుతున్నాయి. పండిపోయిన ఎండుటాకులు ఎండిపోయిన కలల్లాగ, ఎగిరిపోతున్న ఆశల్లాగ వున్నాయి. బోసిగా వున్న చెట్లు మాసిపోయిన పసితనానికి కాపలా కాస్తున్న వృద్ధుల్లా నిలబడి వున్నాయి.

"నా మోడు బ్రతుకు కంటే మీరే నయం. బ్రతికి వున్నంతవరకు ప్రతి యేడు మీకు వసంతం వస్తూనే వుంటుంది. నాకు ఈ జన్మకు మళ్ళీ రాదు-" దిగులుగా అనుకుంది రాధ.

"ఒక్కసారి ద్వారకకు తీసుకెళ్ళు కృష్ణయ్యా! నీ



వేడుక, వైభవం చూడాల్ని వుంది'' అనుకుంటూ ఊహల్లోనే ద్వారక ఆకారాన్ని ప్రాకారాన్ని చిత్రించుకుంది మనసులో. ఎలా వుంటుందో అక్కడ? రంగరంగ వైభవంగా, అందాలూ, ఆనందాలూ చిందులేస్తూ, హాసాలూ విలాసాలూ సహవాసం చేస్తూ, శాంతి, సౌఖ్యం సరసాలాడుకుంటూ వున్నాయేమో.

కృష్ణుడి అంతఃపురాన్ని ఊహించుకుంది రాధ. అష్టమి రోజున పుట్టినవాడికి అష్ట భార్యలట. అష్టయిశ్వర్యాలు అతనికి వున్నాయట. ఇప్పుడేం చేస్తున్నాడో ఇందీవరాక్షుడు? ఏకాంత సేవలో, ఏ కాంత సేవలో వున్నాడో? ఆ బంగారుకొండను ప్రేమతో గుండెలకు అద్దుకోని భార్యామణి వుంటుందా? ఊహూ.

ఒకసారి ఉసూరుమంది రాధ మనసు. ఆ ద్వారకతో పోలిస్తే ఈ ఊరెంత కళావిహీనంగా కనబడుతోందని ఒక్కసారి తనను తాను చూసుకుంది రాధ. కృష్ణుడిని ఆకర్షించేందుకు తనలో ఏ విలాసమూ లేదు. ఏ నగలూ, అలంకారాలూ లేవు. అతని భార్యల అందం ముందూ లావణ్యం ముందూ తను దిగదుడుపేనేమో. ఇలాంటిదాన్ని కృష్ణుడు గుర్తుంచుకుంటాడా? ఇలాంటి పేదరాలిని ద్వారకకు రమ్మంటాడా? ఒకవేళ వెళ్ళినా తనను చూసి అందరూ పరిహాసం చేయరూ?'అదుగో ఆ దిష్టిబొమ్మలాంటి పల్లెటూరి మనిషి ప్రభువుతో మాట్లాడాలట, తగుదునమ్మా అంటూ పిచ్చిదానిలా వచ్చింది. కృష్ణుడు దీని ముఖం చూస్తాడా' అని ఆడవాళ్ళందరూ నవ్వరూ! ఆ ఊహే రాధను వణికించింది. తన కళ్ళముందే కృష్ణుడి వైభవం ఇంతై, అంతై ఆకాశంలో నిండిపోతోంది. జగమంతా నిండిన ఆ జగన్నాథుడి పాదాల ముందు నిలబడిన అడవి పువ్వును చూసి అతని జనం నవ్వుతున్నారు. అంత ఎత్తున కృష్ణుడిని నిలబెట్టిన వైభవం అతన్ని వంగనిస్తుందా? వంగి, చేతితో ఈ పువ్వును లేవనెత్తి, ఓదార్చనిస్తుందా? ఊహూ. అది ఎన్నడూ జరగదు. ఎక్కడి రాధ. ఎప్పటి రాధ. చిన్ననాటి స్నేహబంధాన్ని మధురమైన ఊహలతో మర్రి వూడల్లా పెంచుకుంది. ఆ వూడలే ఈ రోజు ఉరితాళ్ళలా మారాయి.

"ప్రభూ! ఇలా బ్రతికించే బదులు ఆ పాదాలతో ఈ పువ్వును తొక్కెయ్యకూడదా? శాశ్వతంగా మోక్షాన్ని ప్రసాదించకూడదా?'' కన్నీళ్ళు కారుస్తున్న రాధ బాధతో కళ్ళు మూసుకుంది. మూసిన కనురెప్పల వెనుక మూసిన ఆశలు ముసిముసిగా నవ్వాయి. కన్నీళ్ళు తుడుచుకోబోతున్న రాధ చెయ్యిని ఎవరిదో చెయ్యి ఆపేసింది. ఒక నల్లటి చెయ్యి కాటుకను కరిగించిన కన్నీళ్ళను తుడిచింది. ఎవరా? అని ఉలికిపడుతూ చూడబోయిన రాధ నేత్రద్వయాన్ని హస్తద్వయం దయతో మూసింది. ఆ స్పర్శ జీవచ్ఛవం లాంటి రాధలో ప్రాణమై ప్రసరించింది. తనను తాను కనుక్కున్న రాధ వచ్చిందెవరో తెలుసుకుంది. తటాలున తన కళ్ళను మూసిన చేతులను తొలగించి వెనుదిరిగి చూసింది. నవ్వుతున్న నల్లనయ్యను చూడగానే నల్ల కలువల్లాంటి రాధ కళ్ళు నవ్వుతో మెరిశాయి.

"నువ్వా! ఇక్కడి కెలా వచ్చావు? ఎప్పుడు వచ్చావు?''అంటూ రాధ అడుగుతున్న ప్రశ్నలకు కృష్ణుడి చిలిపినవ్వులే సమాధానం ఇచ్చాయి. ఆశ్చర్యంతో చుట్టూ చూసింది రాధ. రథం లేదు. పరివారం లేదు. ఎవరూ లేకుండా ప్రభువు ఎలా వచ్చాడు?

రాధ మనసులోని సంశయాన్ని గ్రహించి కృష్ణుడు నవ్వాడు."రథంలో రాలేదు రాధా, నన్ను ఇక్కడకు తీసుకొచ్చింది నా మనోరథం. నా మిత్రులు, పరివారం అంతా ఇక్కడే వున్నప్పుడు,




వేరే పరివారంతో రావలసిన అవసరం ఏముంది'' అంటున్న కృష్ణుడిని నివ్వెరపోయి చూసింది రాధ. బీటలువారిన భూమిని వాన చినుకులు తడిపినట్టు కృష్ణుడి మాటలు రాధ మనసును ఆర్ద్రతతో నింపాయి. గతం పాడిన కమనీయ గీతాన్ని మళ్ళీ వినింది. వంశీమోహనుడు వేణువును మనోహరంగా మ్రోగించాడు. సంగీత ప్రవంతిలో కొట్టుకుపోతున్న రాధకు కాలం తెలియలేదు. సూర్యుడు పడమట వాలే వేళకు ''మరి వెళ్ళనా' అన్న కృష్ణుడి మాటలు రాధకు స్పృహ తెప్పించాయి.'అప్పుడేనా' అని బేలగా అడిగితే చూపుడు వేలితో సూర్యుడిని చూపించాడు.

"ద్వారకకు వెళ్తే నేను గుర్తుంటానా?'' దీనంగా అంటున్న రాధను చూసి నవ్వాడు కృష్ణుడు.

"నిన్ను మరిపించే శక్తి ద్వారకకు వుందా?'' అన్నాడు.

"ఆ వైభవం, నీవాళ్ళూ, నీ సతులూ సుతులూ వీళ్ళతో సుఖంగా వుండే నీకు రాధమ్మా ఈ యమునా నదీ తలుచుకోవలసిన అవసరం ఏముంది?'' అంటున్న రాధ మనసులోని విరక్తి అర్థం అయింది కృష్ణుడికి.

"రాధా! ఈ ప్రకృతి అందం, ఇక్కడి ఆనందం, నీలోని నిర్మలమైన ప్రేమా ఆ ఇరుకు గోడల ద్వారకలో దొరుకుతాయంటావా? పిపాసను చల్లార్చే యమునెక్కడ? గొంతులో పోసుకోలేని సాగర జలాలెక్కడ? ఈ రాధ నాకు బహూకరించిన స్నేహం, ప్రేమ, వాత్సల్యం, అనుభూతి — ఆడంబరాల్లో, మిగిలిన ఆడవాళ్ళల్లో నాకు దొరుకుతాయా? అన్నిటినీ నాలో కలుపుకునే అనంత సాగరాన్నయిన నా వైపు ప్రవహిస్తూ, ఎప్పటికీ సంగమించే యమునా నదివి నువ్వు. ద్వారకలో నదులు లేవు. చుట్టూ క్షారజలాలే. నగరాల్లో నటన లెక్కువ. అంతరంగాలు సంకుచితం. పుట్టినప్పుడే చెరసాల నుండి బైటపడ్డవాణ్ణి ఇంత పెద్దయ్యాక సంకుచితమైన మనసుల్లో ఖైదీగా వుంటాననుకున్నావా? విశ్వంలో లీనమయ్యేవాడివి ఒకచోట బందీగా ఎలా వుంటాను? రాచకార్యాల్లో మునిగినా, నా మనసు తేలేది యమునా తటి దగ్గరే.''

కృష్ణుడి మాటలను నివ్వెరపోయి వింటున్న రాధ చెక్కిళ్ళు ఆనందాశ్రువులతో తడిసిపోయాయి. వెళ్ళిపోయేందుకు సిద్ధమైన కృష్ణుడి చెయ్యి పట్టుకుని ''ఒక్క మాట'' అంది.

"ఏమిటో చెప్పు?'' అన్నాడు నవ్వుతూ.

"నా ఆఖరి క్షణంలో నువ్వు నా దగ్గరకు వస్తావా?'' జీరపోతున్న గొంతుతో అడిగింది రాధ.

"ఆఖరి క్షణమా? ఎవరికి వచ్చేది? నీకా'' అంటూ చిరునవ్వు నవ్వాడు. ''భూమిపైన మనిషి వున్నంతవరకూ నేను వుంటాను, మనసు వున్నంత వరకూ నువ్వుంటావు. ఆఖరి క్షణం రాదు రాధా. రాబోయే కాలంలో రాచకార్యాల్లో నేనే సారథ్యం వహించవచ్చు. కానీ నా హృదయానికి సారథివి నువ్వే రాధా'' అన్నాడు అనునయంగా రాధ కన్నీరు తుడుస్తూ.

తన్మయత్వం నుంచి తేరుకున్న రాధ కళ్ళు విప్పి చూసేసరికి అనంతుడి అంతు లేదు. ఎక్కడలేని నిస్పృహ ఆవరించింది రాధలో. 'ఉదయం నుండి చంద్రోదయం వరకు నేను కన్నయ్యను గురించి కలలు కన్నానా? ఎంత పిచ్చిదాన్ని!' అనుకుంటూ నిట్టూర్చింది. 'అసలు తనిక్కడికి ఎందుకొచ్చింది? నీళ్ళ కోసం కదూ?' అనుకుంటూ లేచి కడవను ఎత్తి నీళ్ళల్లో ముంచబోయి పట్టుదప్పి వదిలేసింది.

బరువుగా నిట్టూరుస్తూ ఒడ్డు వైపు అడుగేసిన రాధ పాదాలకు ఏదో మెత్తగా తగిలితే ఉలిక్కిపడి కిందకు చూసి ఆశ్చర్యపోయింది. కింద పూలదండ, నెమలి పింఛం వున్నాయి. నిజంగా కృష్ణుడు వచ్చాడు. తనతో ఇప్పటి వరకూ వున్నాడు! సంతోషంతో రాధ చేతుల్లోకి ఆ పూలదండను తీసుకుని చూసింది. కృష్ణుడి మేని మీదున్న చందనపు పరిమళం ఆ పూలవాసనతో కలిసి విలాసంగా నవ్వుతోంది. నిర్మలమైన మనసుతో ఆ పూలదండను మెళ్ళో వేసుకుని నెమలి పింఛంతో చెక్కిలి నిమురుకుంటూ ప్రస్థానం వైపు నడిచింది రాధమ్మ.

నదిలోకి జారిన కడవ పడవలాగా నీళ్ళల్లో తేలుతూ నెమ్మదిగా మునగసాగింది; పారవశ్యంలో తేలిపోతూ ఆనంద ప్రవాహంలో మునిగిన రాధ మనసులా.

●●●



15-6-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక